క్లుప్తంగా

పోలీస్ స్టేషన్ తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి

కిర్లంపూడి: సాధారణ తనిఖీల్లో భాగంగా పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి కిర్లంపూడి పోలీస్‌స్టేషన్‌ను సోమవారం సందర్శించారు. స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల రికార్డులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను, వాటి పురోగతిని పోలీస్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. జగ్గంపేట సీఐ లక్ష్మణరావు, కిర్లంపూడి ఎస్సై పి.ఉమామహేశ్వరరావు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

క్విజ్ పోటీల్లో శ్రీ ప్రకాష్ విద్యార్థుల ప్రతిభ



క్విజ్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు

తుని: భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో నిర్వహించిన భారత్ కో జానో క్విజ్ పోటీల్లో శ్రీ ప్రకాష్ విద్యార్థులు ప్రతిభ చూపారని ప్రిన్సిపాల్ మూర్తి సోమవారం తెలిపారు. ప్రాంత్ స్థాయి పోటీలో జూనియర్ విభాగంలో అజితేష్ త్రిపాఠీ, గణేశ్ పార్థు ప్రతిభ చూపి ఈనెల 26న విశాఖపట్నంలో జరగనున్న రీజినల్ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. సీనియర్స్ విభాగంలో ఆర్.లలిత శరణ్య, హర్షితలు ద్వితీయ స్థానంలో నిలిచారు. రీజినల్ స్థాయిలో ప్రతిభ చూపాలని కోరారు. ఈ విద్యార్థులను విద్యాసంస్థల అధినేత సీహెచ్‌వీకే.నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్‌లు అభినందించారు.

హిందూ ధర్మాన్ని కాపాడుకుందాం

రౌతులపూడి: పరాయి దేశస్తుల పరిపాలనలో హిందూ ధర్మం మసక బారిందని, మన ధర్మాన్ని కాపాడుకుందామని దివ్యానంద సరస్వతి స్వామిజీ పిలుపునిచ్చారు. స్థానిక శివాలయం వద్ద సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన హిందూ సమ్మేళన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అనంతరం వివిధ గ్రామాల నుంచి వచ్చిన హైందవులు ఆధ్యాత్మిక కళలను ప్రదర్శించారు. అనంతరం వారితో కలిసి శోభయాత్ర నిర్వహించారు.

ఉత్సాహంగా త్రోబాల్ పోటీలు

తుని: రోటరీక్లబ్ నిర్వహిస్తున్న రంగం యువజనోత్సవాల్లో భాగంగా సోమవారం తునిలో నిర్వహించిన త్రోబాల్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఆరు నుంచి పది వరకు చదువుతున్న విద్యార్థులకు శ్రీప్రకాష్ విద్యానికేతన్ ఆవరణలో నిర్వహించిన పోటీలకు 30 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో గెలిచిన విద్యార్థులకు ముగింపు వేడుకల్లో బహుమతులను అందజేస్తామని రోటరీక్లబ్ తుని శాఖ కార్యదర్శి కిశోర్‌రెడ్డి తెలిపారు. రోటరీక్లబ్ అధ్యక్షుడు వర్మ, కోశాధికారి గణేష్, ప్రసాద్, నాగిరెడ్డి, డివి.రాజు, సీహెచ్.మంగరాజు, వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ కనెక్షన్ల పంపిణీ

కోటనందూరు: అల్లిపూడిలో గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. ఉజ్వల పథకంలో భాగంగా సోమవారం వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు 26 మంది లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్లు అందజేశారు. మహిళల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని చినబాబు అన్నారు.

27, 28 తేదీల్లో లిబరేషన్ ధర్నా

ప్రత్తిపాడు: తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ విజయవాడ జింఖాన మైదానంలో ఈనెల 27, 28 తేదీల్లో జరుగనున్న సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ మహాధర్నాను విజయవంతం చేయాలని ఏఐసీసీటీయూ రాష్ట్ర కార్యదర్శి గొడుగు సత్యనారాయణ, అఖిల భారత వ్యవసాయ-గ్రామీణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మానుకొండ లచ్చబాబు పిలుపునిచ్చారు. స్థానిక లిబరేషన్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం వారు విలేకరులతో మాట్లాడుతూ విజయవాడలో రెండు రోజుల పాటు కొనసాగే మహాధర్నాను విజయవంతం చేయాలని గొడుగు సత్యనారాయణ, మానుకొండ లచ్చబాబు కోరారు.

చీడికమ్మకు బోనాలు సమర్పణ

తుని రూరల్: కేఓ మల్లవరం గ్రామదేవత చీడికమ్మతల్లికి గ్రామస్తులు బోనాలను సమర్పించారు. సోమవా రం అమ్మవారి జాతరను పురస్కరించుకుని కేరళ కళాకారుల వాయిద్యాలతో బోనాలను ఊరేగింపుగా తీసుకువెళ్లిన మహిళలు అమ్మవారికి సమర్పించారు. రాత్రి జాగరణ నిర్వహించారు. సర్పంచ్ దొంక సత్యవతి, ఏఎంసీ డైరెక్టర్ అన్నంరెడ్డి వీర్రాఘవులు, మాజీ సర్పంచ్ ఏకా కన్నయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వేషధారణలు

కిర్లంపూడి: మండలంలోని కిర్లంపూడి, జగపతినగరం, చిల్లంగి, గెద్దనాపల్లిలో శ్రీగౌరీ శంకరుల ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం జగపతినగరంలో స్థానిక కళాకారులు రామలక్ష్మణుల తాటకి సంహారణ, వాలిసుగ్రీవుల యుద్ధం, పులివేషాలు, నవదుర్గలు, కోయిదొరల వంటి పలు వేషధారణలు చూపరులను ఆకట్టుకున్నాయి.

సొమ్ములు దోచేశారు బాబూ!

- మంత్రి దాడిశెట్టి రాజా
- గ్రామ సచివాలయ ప్రారంభోత్సవం
- వైఎస్సార్ సీపీలో చేరిన వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించిన మంత్రి



లోవకొత్తూరు కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి దాడిశెట్టి రాజా



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో మంత్రి దాడిశెట్టి రాజా

తుని రూరల్: అధికారాన్ని అడ్డుపెట్టుకుని స్కీముల పేరుతో చంద్రబాబు నాయుడు ప్రజల సొమ్మును దోచుకున్నాడని రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. సోమవారం లోవకొత్తూరులో రూ.40 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభించి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. లబ్ధిదారులకు జగనన్న ఇళ్లస్థలాల పట్టాలను పంపిణీ చేసి, గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంత్రి నిర్వహించారు. జేసీఎస్ ఇన్‌చార్జి సకురు నాగేంద్ర నెహ్రూ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మంత్రి దాడిశెట్టి రాజా మాట్లాడారు. అధికారం ఉన్నన్నాళ్లు చంద్రబాబు ప్రజలకు ఎటువంటి ఉపకారం చేయలేదన్నారు. జన్మభూమి కమిటీలకు, టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు అనుకూలమైన పథకాలు ప్రవేశపెట్టి, స్కీముల్లో స్కాములకు పాల్పడి ప్రజల సొమ్ములను కుటుంబానికి, అనుకూల వ్యక్తులకు దోచిపెట్టారన్నారు. హెరిటేజ్ మజ్జిగ, పోలవరం ప్రాజెక్టు, పోలవరం కాలువలు, స్కిల్ పేరుతో స్కాములు చేశాడన్నారు. చంద్రబాబు స్కాముల వల్ల ఒక తరం యువత తీవ్రంగా నష్టపోయిందన్నారు. కరోనా వంటి కష్టకాలాన్ని ఎదుర్కొన్నప్పటికీ లోవ దేవస్థానాన్ని రూ.15 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్టు చెప్పారు. గత 40 ఏళ్లలో లభించిన అమ్మవారి ఆదాయాన్ని టీడీపీ నాయకులు, యనమల సోదరులు స్వాహా చేశారన్నారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి తన ప్రభుత్వంలో పేదలకు పెద్దపీట వేశారన్నారు. పేదలే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలన్నారు. ఈనెల 25న తుని రాజా జూనియర్ కళాశాల మైదానంలో జరిగే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సామాజిక సాధికార బస్ యాత్రకు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఏఎంసీ చైర్మన్ మాకినీడి బాబు, ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము, జెడ్పీటీసీ పోతల సూర్యమణి, సర్పంచ్ లంక వెంకటలక్ష్మీ, ఎంపీటీసీ సభ్యురాలు గుర్తుర్తి పద్మ, ఎంపీడీఓ పి.రవికుమార్, తహసీల్దార్ ఎల్.శివకుమార్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరికలు

తుని రూరల్: మండలంలో లోవకొత్తూరు, కొత్తవెలంపేట గ్రామాలకు చెందిన 40 మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. సోమవారం జేసీఎస్ ఇన్‌చార్జి సకురు నాగేంద్ర నెహ్రూ అధ్యక్షతన లోవకొత్తూరులో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మంత్రి దాడిశెట్టి రాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్తవెలంపేట, లోవకొత్తూరు గ్రామాలకు చెందిన రొంగల ప్రసాద్, చిటికెల రమేష్, కిల్లి నాగేశ్వరరావు, బుద్దా చంటి, నొక్కు సత్తిబాబు, సిద్ధాంతపు సింహాచలం, సాకా కృష్ణతో సహ 40 మంది పార్టీలో చేరారు. వీరందరికీ మంత్రి దాడిశెట్టి రాజా పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి దాడిశెట్టి రాజా మాట్లాడుతూ 40 ఏళ్ల అధికారంలో ఉన్న యనమల రామకృష్ణుడు గ్రామస్తులకు చేసిందేమి లేదన్నారు. కనీసం గ్రామంలో వాటర్ ట్యాంకు కూడా నిర్మించలేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతి ఇంటికీ రక్షిత తాగునీటి కుళాయిలు ఇచ్చిందన్నారు. ఈ గ్రామ సమీపంలోని పోలవరం కాలువ కాంట్రాక్ట్‌ను తన వియ్యంకుడికి కట్టబెట్టి రూ.కోట్లు సంపాదించారన్నారు. నాలుగున్నరేళ్లలో గ్రామంలో అభివృద్ధి, సంక్షేమానికి రూ.29 కోట్లు ఖర్చు చేశామన్నారు. సచివాలయం నుంచి ఓసీ, బీసీ, ఎస్సీ కాలనీలను అనుకుని రహదారి నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. నాయకులు, కార్యకర్తలు కలిసి పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. అంతకు ముందు గ్రామంలో మంత్రి రాజా నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. గ్రామంలో బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. లోవ దేవస్థానం స్థలంలో టీటీడీ కల్యాణ మండపం నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంటా చక్రరావు, మండల అధ్యక్షుడు దుంగల నాగేశ్వరరావు, ఎస్సీ సెల్ నాయకులు లంక కృపానందం, గారా శ్రీనివాసరావు, ఆత్మ కమిటీ చైర్మన్ చోడ్రాజు రాంబాబురాజు, లోవ మాజీ చైర్మన్ దూలం మాణిక్యం, తాండవ షుగర్స్ మాజీ చైర్మన్ నాగం దొరబాబు పాల్గొన్నారు.

యూటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా నాగభూషణం



గోకవరం: మండలానికి చెందిన కె.నాగభూషణం యూటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా నియమితులయ్యారు. బూరుగుపూడి ద్వారకామాయి ఫంక్షన్ హాలులో ఆదివారం జరిగిన జిల్లా కౌన్సిల్ ఎన్నికలో ఆయన జిల్లా కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఆయన గతంలో గోకవరం మండల ప్రధాన కార్యదర్శిగా రెండుసార్లు సేవలందించారు. ఈ సందర్భంగా ఆయన్ను మండల యూటీఎఫ్ శాఖ నాయకులు అభినందించారు.

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ

ప్రత్తిపాడు: గ్రామంలో పంట పొలాల్లో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురయ్యాయి. ఇటీవల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను విడదీసి, వాటిలో ఉంటే కాపర్ వైర్లు, సామగ్రి దోచుకుపోతున్నారు. శనివారం అర్ధరాత్రి సమయంలో స్థానిక జాతీయ రహదారిపై ఉన్న గోవిందపురం చెరువు గట్టు సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్లలో ఉండే సామగ్రిని దోచుకుపోయారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు రెడ్నం వెంకటేశ్వరరావు, కేశవరపు సూరిబాబు, చెలంకూరి భానులకు చెందిన పంట పొలాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని సామగ్రిని దోచుకుపోయారు. ఈ చోరీలపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు రైతులు తెలిపారు.

యువత ఓటు నమోదు చేసుకోవాలి

ఏలేశ్వరం: యువత ఓటు నమోదు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్, ఎన్నికల అధికారి కె.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం విద్యార్థులకు ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. అనంతరం ఓటు నమోదుకు 6ఏ ఫారాలు అందజేశారు. మున్సిపల్ టీపీఓ ఆనంద్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి

ప్రత్తిపాడు: ప్రతి విద్యార్థి ఉన్నత చదువులు చదివి ఉన్నతంగా ఎదగాలని ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, ప్యానెల్ అడ్వకేట్ బొంగుకూరి మధుబాబు అన్నారు. అంతర్జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో బొంగుకూరి మధుబాబు మాట్లాడుతూ విద్యార్థులు సమాజానికి ఉపయోగపడే పౌరులుగా తమను తాము తీర్చిదిద్దుకోవాలని అన్నారు. మరో ప్యానెల్ అడ్వకేట్ అవసరాల దేవి మాట్లాడుతూ నిర్బంధ విద్యాహక్కు చట్టం, ఉచిత విద్య తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సదస్సులో ఉపాధ్యాయులు రమణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఖోఖో జట్టుకు విద్యార్థుల ఎంపిక



ఖోఖో జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

తుని రూరల్: ఈనెల 26వ తేదీ నుంచి 30వ తేదీ వరకు కేరళలో జరగనున్న సౌత్ జోన్ యూనివర్సిటీ ఖోఖో పోటీలకు తుని ప్రభుత్వ డిగ్రీ అటానమస్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్టు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ లలిత సోమవారం తెలిపారు. ఈనెల 18న తూర్పు గోదావరి జిల్లా అనపర్తిలో నిర్వహించిన పోటీల్లో జట్టు ఎంపిక జరిగాయన్నారు. జట్టులో తమ కళాశాలకు చెందిన సీహెచ్ రోహిత్ (ఫస్ట్ బీకాం), ఎస్.మౌళి (సెకెండ్ బీఏ)లకు స్థానం లభించిందన్నారు. 26 నుంచి 30 వరకూ కేరళలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. క్రీడాకారులను పలువురు అభినందించారు.

ప్రజల కోసం పరితపించే నాయకుడు జగన్

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- గ్రామాల్లో వై ఏపీ నీడ్స్ జగన్



గుర్రంపాలెం గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించిన ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు



జె.అన్నవరంలో పార్టీ జెండాను ఎగురవేస్తున్న పార్టీ కన్వీనర్ పార్థసారథి, ఎమ్మెల్యే పర్వత ప్రసాద్



ఎ.కొత్తపల్లిలో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ నాగం గంగబాబు

జగ్గంపేట: ప్రజలు, రాష్ట్రాభివృద్ధి కోసం పరితపించే నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. గుర్రంపాలెం గ్రామంలో సోమవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ నేత పడాల విష్ణు, గ్రామ సర్పంచి లక్ష్మీ ఆధ్వర్యంలో నంది సెంటర్‌లో ఏర్పాటు చేసిన పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు. గ్రామంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ తెలిపే డిస్‌ప్లే బోర్డును ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి పేదవాడికి లబ్ధిచేకూరాలని, వారి కల నెరవేరాలని సీఎం జగన్ పనిచేస్తున్నారన్నారు. భవిష్యత్ తరాలకు మేలు జరగాలంటే మళ్లీ జగనే సీఎం కావాలన్నారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నేత జ్యోతుల రామస్వామి, కిర్లంపూడి ఎంపీపీ తోటరవి, జగ్గంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పెద్దాడ రాజబాబు, రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ డైరెక్టర్ అప్పారావు కాపు, వైఎస్సార్ సీపీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం తదితరులు పాల్గొన్నారు.

ఎ.కొత్తపల్లిలో..

తొండంగి: ఎ.కొత్తపల్లి గ్రామ సచివాలయం వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నాగం గంగబాబు పాల్గొని ప్రజలకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. అనంతరం వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కొయ్యా మురళి, దడాల విజయ్, పార్టీ కన్వీనర్ బద్ది నూకరాజు, యూత్ కన్వీనర్ అరుమిల్లి ఏసుబాబు, మండల సమన్వయ కమిటీ సభ్యుడు బెక్కం చంద్రగిరి, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ డి.ఆంజనేయులు, సర్పంచ్ బెక్కం రాజా వరలక్ష్మి, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

బూరుగుపూడిలో

కిర్లంపూడి: బూరుగుపూడి సచివాలయాలు 1, 2 పరిధిలో స్థానిక ఉపసర్పంచ్ పాఠంశెట్టి కృష్ణమూర్తి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు పాల్గొని సంక్షేమ పథకాలు వివరాలతో కూడిన బోర్డులను, వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తోట రవి, జెడ్పీటీసీ సభ్యులు తోట గాంధీ, ఆశపు భద్రి, కర్రి నారాయణమూర్తి, పాఠంశెట్టి విశ్వనాథం, దోమాల గంగాధర్, సూతి శ్రీను, జనపరెడ్డి బాబు, ఈఓపీర్డీ ఇ.మార్కెండేశ్వరరావు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మల్లేపల్లిలో

గండేపల్లి: మల్లేపల్లిలో సోమవారం జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమానికి ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కుంచె రాజ, మాజీ జెడ్పీటీసీ బిత్రా గిరిబాబు, గ్రామ ఉప సర్పంచ్ దొమ్మ శ్రీను, పార్టీ నేతలు పాల్గొన్నారు.



ప్రత్తిపాడులో వైఎస్సార్ సీపీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న పంచాది వీరబాబు

రాష్ట్రాభివృద్ధికి జగన్ కావాలి : ఎమ్మెల్యే పర్వత

ఏలేశ్వరం: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే సీఎంగా జగన్ మళ్లీ కావాలని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. జె.అన్నవరంలో పార్టీ మండల కన్వీనర్ అడపా పార్థసారథి అధ్యక్షతన జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం ఆయన పాల్గొని సంక్షేమ పథకాలను వివరించారు. సంక్షేమ బోర్డు, పార్టీపతాకాన్ని ఆవిష్కరించారు. పార్టీ నాయకులు కొండపల్లి వెంకటేశ్వరరావు, నీరుకొండ సత్యనారాయణ, అలమండ చలమయ్య, చిక్కాల లక్ష్మణరావు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో..

ప్రత్తిపాడు: స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం సాయంత్రం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పంచాది వీరబాబు, ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి పాల్గొని ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. ముందుగా దివంగత నేత వైఎస్ రాజశేఖరునికి విగ్రహానికి పూలమాలలు వేశారు. పార్టీ పతాకాన్ని, సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల బోర్డును మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ పంచాది వీరబాబు ఆవిష్కరించారు. గ్రామ సర్పంచ్ గుడాల విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యుడు రెడ్నం వెంకటేశ్వరరావు, జేసీఎస్ మండల కన్వీనర్ రామిశెట్టి చినబాబు, ఎంపీటీసీ సీంద్రపు భాస్కరరావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ, అన్నవరం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు దళే చిట్టిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వానికి మద్దతు ఇవ్వండి

తుని: పేదల కోసం పని చేస్తోన్న ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి కోరారు. సోమవారం 2, 3 వార్డుల సచివాలయ పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీపీ సుధారాణి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు వైఎస్సార్ సీపీ జెండాను, నాలుగున్నర ఏళ్లలో జరిగిన జరిగిన సంక్షేమ,అభివృద్ధి వివరాలతో కూడిన ఫ్లెక్సీను ఆవిష్కరించారు. ఇంటింటికి ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తోన్న పథకాలను వివరించారు. గాంధీసత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, తుని పట్టణశాఖ పార్టీ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, జెడ్ఆర్‌యూసీసీ సభ్యుడు బోడపాటి శ్రీను, కౌన్సిలర్లు కర్రి సత్య జగదీష్, తుమ్మలపల్లి రాజు, వారాధి జ్యోతి, మాజీ కౌన్సిలర్లు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి వైఎస్సార్ సీపీతోనే సాధ్యం

ఆత్మీయ సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకుడు తోట నరసింహం



సమావేశంలో మాట్లాడుతున్న తోట నరసింహం

గండేపల్లి: రాష్ట్ర ప్రజల అభివృద్ధి వైఎస్సార్ సీపీతోనే సాధ్యమని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకులు తోట నరసింహం తెలియజేశారు. మండలంలోని సింగరంపాలెంలో కోర్పు దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వాలు అందజేయని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. రాష్ట్రం అభివృద్ధి బాటలో నడవాలంటే మళ్లీ జగన్‌రావాలని ఆయన కోరారు. పార్టీ సీనియర్ నాయకులు అత్తులూరి సాయిబాబు, ఉభయ గోదావరి జిల్లాల ఎస్సీసెల్ జోనల్ ఇన్‌చార్జి గుల్లా ఏడుకొండలు, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ రామకుర్తి మూర్తి, జిల్లా వక్ఫ బోర్డ్ మాజీ చైర్మన్ గఫూర్, ఏఎంసీ మాజీ చైర్మన్ సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

రబీలో అపరాల సాగే మేలు

తొండంగి: రబీలో అపరాల సాగుపై దృష్టి సారించాలని మండల వ్యవసాయశాఖాధికారి ఎస్.నరసింహం అన్నారు. సోమవారం కృష్ణాపురంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల కారణంగా రబీలో వరి సాగుకు పంపా ఆయకట్టులో అవకాశం లేదన్నారు. ఈ నేపథ్యంలో అపరాల సాగే మేలని రైతులకు సూచించారు. అనంతరం గ్రామంలో ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కందా వెంకటేశ్వరరావు(శ్రీధర్), గ్రామసచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



ఏలేశ్వరంలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



శంఖవరంలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ పర్వత రాజుబాబు

ఏలేశ్వరం: 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సోమవారంతో ఘనంగా ముగిసాయి. వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. చివరిరోజు పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ ఆధ్వర్యంలో వారోత్సవాలు జరిగాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శిడగం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పుస్తక పఠనం తప్పనిసరిగా చేయాలన్నారు. పుస్తక పఠనం ద్వారా విజ్ఞానం పెంపొందుతుందన్నారు. గ్రంథాలయాల్లో పుస్తకాల చదవడం ద్వారా అనేక విషయాలు తెలుసుకోవచ్చాన్నారు. నిరుద్యోగ యువతకు గ్రంథాలయా పఠనం తప్పనిసరి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత సుంకర రాంబాబు, చెన్నాప్రగడ సత్యగాంధీ, ఏబీవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కిర్లంపూడి: జాతీయ గ్రంథాలయాల వారోత్సవాల ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. వీరవరం గ్రంథాలయంలో వ్యాసరచన పోటీల్లో మెరిట్ సాధించిన విద్యార్థులకు స్థానిక కెనరా బ్యాంక్ మేనేజర్ నరసింహం సర్టిఫికెట్లను అందజేశారు. తోట సర్వారాయుడు, కె. సత్యనారాయణ, గ్రంథాలయాధికారి వి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కోటనందూరు: స్థానిక శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సోమవారం ఘనంగా ముగిసాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో లైబ్రేరియన్ బి.నాగరత్నం మాట్లాడుతూ చిన్నలు, పెద్దలు, యువకులు విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు గ్రంథాలయాలు ఎంతాగానో ఉపయోగపడతాయన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

శంఖవరం: స్థానిక గ్రంథాలయంలో వారోత్సవాల ముగింపు కార్యక్రమం జరిగింది. వారోత్సవాల్లో నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు ఎంపీపీ పర్వత రాజుబాబు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చింతనీడి కుమార్, గ్రంథాలయాధికారి ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట: జగ్గంపేటలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం, మండల సచివాలయాల కన్వీనర్ బండారు రాజా ముఖ్య అతిథులుగా వచ్చి విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు.

విద్యార్థులకు బహుమతులు

తుని: స్థానిక శాఖ గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సోమవారం ముగిశాయి. గతం వారం రోజులుగా వివిధ విభాగాలలో పోటీలు నిర్వహించిన విద్యార్థులకు వాసవీక్లబ్ ప్రతినిధుల చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసాపత్రం అందజేశారు. వాసవీ క్లబ్ ప్రతినిధులు నాగభూషణం, శాస్త్రీ తదితరులు పాల్గొన్నారు.



తునిలో బహుమతులు అందుకున్న విద్యార్థులు

సర్వం.. శివనామ స్మరణం

తుని: కార్తికమాసం తొలి సోమవారం ఆలయాలకు భక్తులు పోటెత్తారు. తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల పరిధిలోని శైవ క్షేత్రాలు శివనామ స్మరణంతో మార్మోగాయి. వేకువ జామున లేచి తాండవ నదిలో స్నానం ఆచరించిన భక్తులు ముక్కంటిని దర్శించుకుని రావి చెట్టు, ధ్వజస్తంభం వద్ద దీపారాధన చేశారు. పట్టణంలోని గవరపేట, పెద్దవీధి, కట్రాళ్లకొండ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులకు ఇబ్బంది లేకుండా ఆయల కమిటీలు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. తొండంగి, కోటనందూరు, తునిరూరల్ మండలాల్లో శైవక్షేత్రాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

ఏలేశ్వరం: కార్తీక మాసం తొలి ఏలేశ్వరంలో శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. ఏలేశ్వరంలోని రాజరాజేశ్వరీ సమేత రామలింగేశ్వరాస్వామి వారిని భక్తులు దర్శించి పూజలు చేశారు. ఏలేశ్వరం, లింగంపర్తి, సిరిపురం గ్రామాల్లోని శివాలయాలు అయ్యప్పస్వాములు, మహిళలు, భక్తులతో కిక్కిరిశాయి. ప్రత్తిపాడు, శంఖవరం, రౌతులపూడి మండలాల్లో శైవక్షేత్రాలు భక్తులతో కిక్కిరిశాయి.



రాచపల్లి అరుణాచలేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

గోకవరం: స్థానిక రామలింగేశ్వరస్వామి వారి ఆలయం వద్ద భక్తులు బారులు తీరారు. ఆలయ ప్రాంగణంలో కోనేటిలో కార్తిక దీపాలు విడిచిపెట్టారు. స్థానిక రమాసత్యనారాయణస్వామి వారి ఆలయంలోఉన్న ఉమా సమేత గోకర్ణేశ్వరస్వామి వారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. కొత్తపల్లిలో రాజలింగేశ్వరస్వామి వారి ఆలయానికి భారీ ఎత్తున తరలివచ్చారు. గోకవరం, తంటికొండ, కృష్ణునిపాలెం శివాలయాలు భక్తులతో కిక్కిరిసాయి.



జగపతినగరం చెరువు వద్ద దీపాలు వెలిగిస్తున్న మహిళలు



తాళ్లూరులో రామలింగేశ్వరస్వామి



ఏలేశ్వరం శివాలయంలో అభిషేకాల్లో పాల్గొన్న భక్తులు